క్లుప్తంగా

కుమార్‌రాజాకు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న కుమార్‌రాజా

రాజోలు: ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన హిందీ అధ్యాపకుడు పాలపర్తి కుమార్‌రాజాకు ఆంధ్రా విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను అందుకున్నారు. 'హిందీ దళిత్ ఆత్మ కథా అభివ్యక్ వ్యక్తిత్వ వికాస్' అనే వ్యాసానికి ఆంధ్ర విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య పీజీడీ ప్రసాదరెడ్డి చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నట్టు కుమార్‌రాజా వివరించారు. హిందీ వ్యాసానికి డాక్టరేట్ అందుకున్న కుమార్‌రాజాను డీవీడీ ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి అభినందించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

మామిడికుదురు: నగరం సురక్షిత మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో గురువారం మామిడికుదురు క్రైస్ట్ ది కింగ్ స్కూల్ ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామని ఫాదర్ పి.రాజేష్ బుధవారం తెలిపారు. ఈ శిబిరం ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వివిధ విభాగాలకు చెందిన వైద్యులు ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తారన్నారు. సాధారణ శస్త్ర చికిత్సలతో పాటు థైరాయిడ్, సుగర్, బీపీ, రక్తలేమి, కొలెస్ట్రాల్, ఆయాసం, దగ్గు తదితర సమస్యలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాజేష్ సూచించారు.

బీజామృతంతో నాట్లు వేస్తే అధిక దిగుబడులు

అంబాజీపేట: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో రైతులు బీజామృతంతో నారుశుద్ధి చేసి వరి నాట్లు వేయడం వల్ల తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చని సర్పంచ్ వాసంశెట్టి రేవతి అన్నారు. వక్కలంకలో ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ రీసోర్స్ పర్సన్ జనిపల్లి నాగవేణి ఆధ్వర్యంలో బీజామృతంతో శుద్ధి చేసిన నారుతో బుధవారం వరి నాట్లు వేశారు. ఈ సందర్భంగా పీఆర్పీ నాగవేణి, ఐసీఆర్పీ జి.పల్లయ్యలు మాట్లాడుతూ వరి నాట్లు వేసే సమయంలో కొనలు తుంచి నాటుకోవాలన్నారు. ఇలా చేయడం వల్ల పురుగు గుడ్డు దశను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో రైతులు శీలం నరసింహమూర్తి, వాసంశెట్టి పెదబాబు, ఎం.వెంకటేశ్వరరావు, పి.సుధీర్, ట్రైనర్ కె.అఖిల చాందిని తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్‌పీని బలోపేతం చేయాలి

మామిడికుదురు: మహాజన సోషలిస్టు పార్టీని బలోపేతం చేసేందుకు మాదిగలు ఐక్యంగా కృషి చేయాలని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ సత్తిబాబు సూచించారు. ఎంఎస్‌పీ పదో ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక బస్టాండ్ కూడలిలో కేక్ కట్ చేసి ఎంఎస్‌పీ పతాకాన్ని ఆవిష్కరించారు. సత్తిబాబు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్‌కు చెందిన నేతలు ఎంఎస్‌పీని బలోపేతం చేసేందుకు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నేతలు పాల్గొన్నారు.

ఈనెల 11 నుంచి సప్తాహం

మామిడికుదురు: పెదపట్నంలో వేంచేసిన మూలేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి, కనక దుర్గమ్మ వార్ల ఆలయాల సన్నిధిలో ఈ నెల 11 నుంచి సప్తాహం జరుగుతుందని ఆలయ కమిటీ బుధవారం తెలిపింది. ఈనెల 11 నుంచి 18వ తేదీ వరకు సప్తాహం జరుగుతుందని కమిటీ పేర్కొంది.

వైభవంగా లక్షతులసి పూజ



ఆలమూరులో జనార్దనస్వామి వారి ఆలయంలో లక్ష తులసి పూజ నిర్వహించిన దృశ్యం

ఆలమూరు: స్థానిక శ్రీ, భూ సమేత జనార్దన స్వామి ఆలయంలో బుధవారం వైభవంగా లక్ష తులసి పూజ జరిగింది. ధనుర్మాసం పవిత్రతను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఆలయ పురోహితులు అంగర భగవాన్ ఆచార్యుల పర్యవేక్షణలో ఈ లక్షతులసి పూజ జరిగింది. ప్రముఖ వేద పండితుడు ఖండవిల్లి సూర్యనారాయణాచార్యుల మంత్రోచ్చారణ మధ్య ఆలయ కమిటీ చైర్మన్ వనుం సూరిబాబు దంపతులు పీటలపై కూర్చుని పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని లక్ష తులసి పూజను భక్తిశ్రద్ధలతో తిలకించారు.

నేడు వెంకన్నకు లక్షతులసి పూజ

అంబాజీపేట: స్థానిక కొర్లపాటివారిపాలెంలో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామికి ప్రతి ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే లక్షతులసి పూజను గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ లక్షతులసి పూజలో పెద్ద ఎత్తున మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారని కమిటీ సభ్యులు తెలిపారు. కమిటీ ఆధ్వర్యంలో స్వామికి పూజ నిర్వహిస్తారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన చేపట్టనున్నట్లు తెలిపారు.

అవ్వాతాతలకు ఆర్థిక భరోసా

- ఇకపై ప్రతి నెలా రూ.2750 పింఛన్
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి



ఆత్రేయపురంలో నూతన పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి



లబ్ధిదారులకు పెంచిన పింఛన్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

ఆత్రేయపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇకపై ప్రతి నెలా ఒకటో తేదీన అవ్వతాతలకు రూ.2750 వైఎస్సార్ పింఛన్ కానుక రూపంలో అందించనున్నారని ప్రభుత్వ విప్, చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీపీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ చేసిన 3648 కిలోమీటర్ల సుదీర్ఘ ప్రజా సంకల్ప పాదయాత్రలో అవ్వాతాతల కష్టాలు స్వయంగా విని పింఛన్లు దశలవారీగా రూ.3 వేలకు పెంచుకుంటూ వెళ్తామని ఇచ్చిన హామీ మేరకు 2019లో రూ.2250, జనవరి 2022లో రూ.2500, 2023లో రూ.2750కు పెంచారన్నారు. వచ్చే సంవత్సరం రూ.3 వేలు అవుతుందనినారు. ఆత్రేయపురం మండలంలో నూతనంగా మంజూరైన 378 పింఛన్లు కలిపి మొత్తం 9771 మందికి వైఎస్సార్ పింఛన్ అందజేస్తున్నామన్నారు. ఏవరైనా శుభం పలికితే శుభం జరుగుతుందని అలా కాకుండా టీడీపీ నిత్యం ఖర్మ ఖర్మ అని తిరుగుతుందన్నారని చంద్రబాబు అతని ఖర్మకు అమాయకులైన 11 మంది చావుకు కారణమయ్యారని, ఇదేం ఖర్మ అని తిరుగుతున్న టీడీపీ నాయకులు వారి హయాంలో ఏ కుటుంబానికి ఎంత లబ్ధి చేశారో కూడా తెలుసుకోవాలని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ బోణం సాయిబాబు, రాష్ట్ర అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ డైరెక్టర్ కప్పల శ్రీధర్, మండల పార్టీ కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యుడు కొల్లి శ్యాంసన్, సర్పంచ్‌లు పాలా నాగేశ్వరరావు, గాదిరాజు రామకృష్ణంరాజు, ఎంపీడీవో నాతి బుజ్జి, తహసీల్దార్ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా పింఛన్ల మంజూరు

ఆలమూరు: రాష్ట్రంలో మనుపెన్నడూ లేని విధంగా కుల మత వర్గాలకు అతీతంగా అర్హులందరికీ పింఛన్లు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆలమూరు ఎంపీపీ కార్యాలయంలో బుధవారం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పాల్గొని ప్రసంగించారు. మండలంలోని 24 గ్రామ సచివాలయ పరిధిలో 352 కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయనన్నారు. దీంతో మండలంలో ప్రతి నెలా 11037 పింఛన్‌దారులకు రూ.3.04 కోట్లు పంపిణీ చేస్తున్నారు. పార్టీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, సర్పంచ్ నేలపూడి లావణ్య, వైస్ ఎంపీపీ వాసంశెట్టి దుర్గాభవాని, పీఏసీఎస్ అధ్యక్షుడు నెక్కంటి వెంకట్రాయుడు, మోటుపల్లి వెంకన్న, నల్లి రాజు, ఏజీపీ నామాల శ్రీనివాసు, ఎంపీటీసీ ఉన్నమట్ల విజయ కుమారి పాల్గొన్నారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: పెంచిన పింఛన్లతో పింఛన్‌దారుల ముఖంలో పండగ ఆనందం ముందే వచ్చిందని స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పెంచిన పింఛన్లను ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. మండలంలో 271 మందికి నూతనంగా పింఛన్లు పంపిణీ చేశారు. పాతవి 9189 పింఛన్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. మొత్తం వెరశి 9460 మందికి రూ.2750 చొప్పున రూ.2.56 కోట్లు పింఛన్లను రూపంలో పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే వెంట నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు కర్నాసుల సీతారామాంజనేయులు, మండల ప్రత్యేక అధికారి వై.సత్యనారాయణ, ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య, తహసీల్దార్ రియాజ్ హుస్సేన్, జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, వైఎస్ ఎంపీపీ బయ్యా చినబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు యడ్ల కిరణ్ బాబు, వార జయసావిత్రి, కుడుపూడి విద్యాసాగర్, పెట్టా జగన్ తదితరులు ఉన్నారు. అనంతరం సిరిపల్లిలో డయాలసిస్ బారిన పడిన రాయుడు గంగాధరానికి రూ.10 వేల పింఛన్‌ను ఎమ్మెల్యే కొండేటి అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కుడుపూడి శాంతావతి ఉన్నారు.

స్తంభించిన జనజీవనం



అంబాజీపేటలో కురుస్తున్న అకాల వర్షం

అంబాజీపేట: గ్రామంలో బుధవారం కురిసిన అకాల వర్షానికి జనజీవనం స్తంభించింది. సుమారు గంటల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఉద్యోగులు, చిరు వ్యాపారులు వర్షానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బుధవారం వారపు సంత కావడంతో మాంసం, కూరగాయలు, చిరు వ్యాపారులు నానా అవస్థలు పడ్డారు.

ఘనంగా సావిత్రీబాయి జయంతి

పి.గన్నవరం: సావిత్రీబాయి పూలే ఆశయాల సాధనకు అందరూ కృషి చేయాలని ఎంపీపీ అంబటి భూలక్ష్మి అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద సావిత్రీబాయి పూలే జయంతి ఉత్సవాలను బుధవారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి ఎంపీపీ భూలక్ష్మి తదితరులు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయిని కె.జ్యోతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాఠశాల హెచ్‌ఎం డీఎస్‌వీ ప్రసాద్, యూటీఎఫ్ జిల్లా కోశాధికారి కె.సురేష్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం



మగటపల్లిలో తాగునీటి ట్యాంకుకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ అనురాధ, ఎమ్మెల్యే వరప్రసాదరావు

మామిడికుదురు: అభివృద్ధితో పాటు సంక్షేమమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని అమలాపురం ఎంపీ చింతా అనురాధ, రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పేర్కొన్నారు. మగటపల్లిలో బుధవారం పలు అభివృద్ధి పనుల్లో వారు పాల్గొన్నారు. సర్పంచ్ సూరిశెట్టి లక్ష్మి, వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి సూరిశెట్టి బాబి ఆధ్వర్యంలో జలజీవన్ మిషన్ నిధులు రూ.38 లక్షలలో తాగునీటి ట్యాంకు నిర్మాణానికి, రూ.70 లక్షలతో ఇంటింటికీ తాగునీరు అందించే పైప్‌లైన్ పనులకు భూమి పూజ చేశారు. బాబానగర్ చివారులో శ్మశానవాటికకు ఎంపీ నిధులు రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి, ఆల్‌క్యాస్ట్ కాలనీలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. బాబానగర్‌లో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని, పంచాయతీ వద్ద నిర్మించిన సామూహిక మరుగుదొడ్లను ప్రారంభించారు. ఆల్‌క్యాస్ట్ కాలనీలో అంగన్‌వాడీ భవనానికి భూమిపూజ చేశారు. గ్రామ పంచాయతీ ఆధునీకరణ పనులు ప్రారంభించారు. రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎంపీ అనురాధ, ఎమ్మెల్యే వరప్రసాదరావు మాట్లాడారు. గత పాలనకు, నేటి పాలనకు ప్రజలు బేరీజు వేసుకోవాలని, పని చేసే నాయకుడు కావాలో ప్రజల్ని మభ్యపెట్టే నాయకుడు కావాలో ప్రజలే తేల్చుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ కుసుమ వనజకుమారి, జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఖాదర్ వలీ, వైస్ చైర్మన్ సజ్జాద్ హుస్సేన్, పార్టీ నేతలు బొలిశెట్టి భగవాన్, కొమ్ముల రాము, భూపతిరాజు సత్తిబాబురాజు, ఎండీవై షరీఫ్, గౌస్ మొహిద్దీన్, కటకంశెట్టి ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంప్రదాయ వస్త్రధారణ పోటీలు



కొత్తపేట డిగ్రీ కళాశాలలో సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థినులు

కొత్తపేట: భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు ప్రపంచ దేశాలకే ఆదర్శనీయమని స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.అరుణ్‌కుమార్ అన్నారు. స్థానిక కళాశాలలో ప్రిన్సిపాల్ కె.పెద్దిరాజు ఆధ్వర్యంలో గతేడాది నుంచి సంక్రాంతి సందర్భంగా తెలుగు సంస్కృతీ సాంప్రదాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దానిలో భాగంగా ఈ ఏడాది కూడా ఆ కార్యక్రమాలు కొనసాగించడంలో భాగంగా బుధవారం సంక్రాంతి సంప్రదాయ వస్త్రధారణ పోటీలతో కార్యక్రమాలు ప్రారంభించారు. కళాశాల మహిళా సాధికారత విభాగం, సాంస్కృతిక విభాగం సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థినులకు సంక్రాంతి సంప్రదాయ వస్త్రధారణ పోటీలు నిర్వహించారు. సుమారు 50 మంది విద్యార్థినులు ఉత్సాహంగా సంప్రదాయ రీతిలో పట్టుచీరలు ధరించి, ఆభరణాలతో అందంగా తయారై వచ్చి పోటీల్లో పాల్గొనడం ద్వారా ముందుగానే సంక్రాంతి కళ తెచ్చారు. మహిళా సాధికారత విభాగం కన్వీనర్ టి.రమాదేవి, సభ్యులు సీహెచ్‌ఎస్ శ్రీలక్ష్మి, సాయిలక్ష్మి, నాగరాణి, భ్రమరాంబ, అరుణసుందరి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ చెరువులో చనిపోతున్న చేపలు

- దుర్గంధంతో విద్యార్థులకు అవస్థలు
- చర్యలు కోరుతూ స్థానికుల ధర్నా



పాశర్లపూడిలంకలో ధర్నా చేస్తున్న స్థానికులు

మామిడికుదురు: పాశర్లపూడిలంక గ్రామ పంచాయతీకి చెందిన ఆరు ఎకరాల చెరువులో చేపలు రెండు రోజుల నుంచి మృత్యువాత పడుతున్నాయి. చనిపోతున్న చేపల నుంచి తీవ్ర దుర్గంధం వస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువును ఆనుకుని ఉన్న అంగన్‌వాడీ కేంద్రంతో పాటు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు సైతం దీనిపై ఆవేదన చెందుతున్నారు. గ్రామ పంచాయతీకి, ఫిషరీస్ సొసైటీకి మధ్య గత కొంతకాలంగా ఈ చెరువు అంశంపై వివాదం జరుగుతోంది. ఈ వివాదం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉంది. ఈ నేపథ్యంలో చెరువులో చేపలు రెండు రోజుల నుంచి చనిపోతున్నాయని, అవి నీటిలో తేలియాడుతున్నాయని, వాటి నుంచి తీవ్ర దుర్వాసన వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తాము తీవ్ర అనారోగ్యం పాలవుతున్నామంటూ బుధవారం ధర్నా చేశారు. దీనిపై తక్షణం స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దుర్వాసన సమస్యతో విద్యార్థులను స్కూల్‌కి పంపించేందుకు పేరెంట్స్ విముఖత చూపుతున్నారు. దీనిపై పంచాయతీ సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావును ‘సాక్షి’ వివరణ కోరగా చెరువు వివాదం కోర్టు పరిధిలో ఉందన్నారు. ఇక్కడ ఉన్న సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మాజీ ఎంపీటీసీ వాల్మీకి మృతి



వాల్మీకి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వర ప్రసాదరావు

మలికిపురం: మండలంలోని చింతలమోరి గ్రామ మాజీ ఎంపీటీసీ సభ్యుడు రాపాక వాల్మీకి (70) బుధవారం మృతి చెందారు. ప్రస్తుతం ఆయన వైఎస్సార్ సీపీలో కొనసాగుతున్నారు. ఆయన మృతికి ఎమ్మెల్యే దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వాల్మీకి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. అలాగే సర్పంచ్ రాపాక రమేష్‌బాబు, ఎంపీటీసీ తోట రాజేష్, మాజీ ఎంపీటీపీ బోనం వెంకటరామారావు తదితరులు సంతాపం తెలిపారు.

అంధుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపాలి



సమావేశంలో మాట్లాడుతున్న శరత్‌భూషణ్

అంబాజీపేట: అంధులపై ప్రతి ఒక్కరూ ప్రేమానురాగాలు కలిగి ఉండి వారిలో ఆత్మస్థైర్యం నింపాలని ఎంఈఓ డి.కిష్టోఫర్ కర్నోలియస్ అన్నారు. మాచవరం భవిత కేంద్రంలో లూయీ బ్రెయిలీ జయంతిని ఐఈఆర్టీ ఉపాధ్యాయులు ఎస్‌కే బేగం అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. అంతకుముందు లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఐఈఆర్టీ ఉపాధ్యాయులు బేగం సమకూర్చిన బెడ్‌షీట్‌లు, తొండవరం జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు బిస్కట్‌లు, స్వీట్లు, ప్లేట్‌లను దివ్యాంగులకు అందజేశారు. హెచ్‌ఎం బీర హనుమంతరావు, డాక్టర్ అనిల్‌కుమార్, సీఆర్పీలు పి.గోవిందరాజు, ఎస్.నాగరాజు, టి.సత్యనారాయణ, ఎస్.వెంకటేష్, దుర్గారావు, పార్ట్ టైమ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి

రాజోలు: అంధుల లిపి సృష్టికర్త లూయిస్ బ్రెయిలీ జయంతిని బుధవారం రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు అధ్యక్షతన జరిగిన జయంతి వేడుకల్లో బ్రెయిలీ చిత్రపటానికి అధ్యాపకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న బిషప్ బి.శరత్‌భూషణ్ మాట్లాడుతూ అంధత్వం శాపం కాదని ప్రిన్సిపాల్ సాయిబాబు నిరూపించారన్నారు. పాస్టర్ ఇశ్రాయేల్ అంధుడైన తనను నరసాపురం బ్రెయిలీ పాఠశాలలో చేర్పించారని ప్రిన్సిపాల్ సాయిబాబు తన జ్ఞాపకాలను విద్యార్థులకు వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ పద్మనాభం, రాజ్‌కుమార్, శ్రీరామ్మూర్తి, భాస్కరరావు, వల్లి రాజు, శైలజ తదితరులు పాల్గొన్నారు.

షటిల్ టోర్నమెంట్‌లో విజేతలకు బహుమతులు

ఆత్రేయపురం: స్థానిక మహాత్మాగాంధీ కాలేజీ ఆవరణలో రెండు రోజుల పాటు నిర్వహించిన షటిల్ టోర్నమెంట్‌లో విజేతలకు మాజీ ఎంపీపీ పీఎస్ రాజు, కరస్పాండెంట్ సెక్రటరీ పీఎస్ రాజు విజేతలకు బహుమతులు అందజేశారు. ఆర్‌పీఎస్ పేరుతో ఆ కాలేజీ ప్రధానోపాధ్యాయుడు రుద్రరాజు మురళీకృష్ణంరాజు నిర్వహించారు. ప్రథమస్థానం ఆత్రేయపురం గ్రామానికి చెందిన చంపాటి అనిల్‌కృష్ణవర్మ (కిట్టు), ఎ.చిన్న, ద్వితీయ స్థానంలో మడికి గ్రామానికి చెందిన శ్రీధర్, మణి కైవసం చేసుకున్నారు. వారికి పీఎస్‌రాజు చేతుల మీదగా బహుమతులు అందజేశారు.

గొబ్బెమ్మలు సంప్రదాయానికి ప్రతీక



రాధాకృష్ణులకు పూజలు చేస్తున్న మహిళలు

అంబాజీపేట: ధనుర్మాసంలో నిర్వహించే గొబ్బెమ్మలు గోదాదేవికి, శ్రీకృష్ణుడికి, సంప్రదాయానికి ప్రతీకలని కాసు సంతోషి, అప్పన గాయత్రి, మాలతి, కీర్తి, కొప్పరావూరి మాధవి అన్నారు. అంబాజీపేట వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో బుధవారం రాత్రి గొబ్బెమ్మలు, బొమ్మల కొలువు, సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. రాధాకృష్ణులు, గోపి, గోపిక, గోవర్ధన గిరిలు భావించి భక్తి శ్రద్ధలతో పూజిస్తారన్నారు.

రాష్ట్ర పీవీడబ్ల్యూఏ ఆర్గనైజింగ్ సెక్రటరీగా శ్రీను



కొత్తపేట: ఆంధ్రప్రదేశ్ ఫొటో గ్రాఫర్స్, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఏపీపీవీడబ్ల్యూఏ) ఆర్గనైజింగ్ సెక్రటరీగా కొత్తపేటకు చెందిన నామాల వెంకటేశ్వరరావు (శ్రీను) నియమితులయ్యారు. గతంలో మండల శాఖ అధ్యక్షుడిగా, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా శాఖ కార్యవర్గ సభ్యుడిగా సంఘ పటిష్టతకు కృషి చేసిన తనను రాష్ట్ర నాయకత్వం రాష్ట్ర కార్యవర్గంలోకి తీసుకున్నట్టు శ్రీను బుధవారం విలేకరులకు తెలిపారు. ఆ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు పోసిన వీరేంద్రకుమార్ నియామకపత్రం అందజేసినట్టు తెలిపారు. శ్రీనును జిల్లా శాఖ అధ్యక్షుడు గెద్దం సురేష్‌కుమార్, జిల్లా, మండల శాఖల సభ్యులు అభినందించారు.

సమస్యలు పరిష్కరిస్తూ.. అభివృద్ధిని వివరిస్తూ..

- పొడగట్లపల్లి, చింతనలంకలో గడపగడపకూ..
- ఎమ్మెల్యేలు జగ్గిరెడ్డి, చిట్టిబాబు



పొడగట్లపల్లిలో లబ్ధిదారులకు పథకాల లబ్ధి వివరిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి



చింతనలంకలో పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

రావులపాలెం: గ్రామస్థాయిలో సమస్యలను పరిష్కరిస్తూ ప్రజలకు జరిగిన సంక్షేమం, అభివృద్ధిని వివరిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి కోరారు. మండలంలోని పొడగట్లపల్లిలో బుధవారం సచివాలయం-2, పరిధిలోని రాజుల వీధి, మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి గడప గడపకూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వారికి అందిన సంక్షేమాన్ని వివరించడంతో పాటు సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సర్పంచ్ గంధం దేవి, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు గంధం అన్నవరం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరై ఎమ్మెల్యే జగ్గిరెడ్డి వెంట తిరిగారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ఎమ్మెల్యే సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే వారికి అందిన ప్రభుత్వ పథకాలు లబ్ధిని వివరిస్తూ వారికి పత్రాలను అందజేశారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ అవినీతి రహిత పాలన అందిస్తూ కుల, మత, వర్గాలకు, పార్టీలకు అతీతంగా సంక్షేమం, అభివృద్ధి అందిస్తున్నారన్నారు.

సాయాన్ని అందజేస్తూ..

గ్రామంలో ముర్రావుపేటలో పెరాలసిస్‌తో మంచం పట్టిన కోటి నాగమణిని పరామర్శించి కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి అందజేశారు. అలాగే ఇటీవల మరణించిన గ్రామానికి చెందిన పులగం శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా క్లెయిమ్ రూ.లక్ష ప్రభుత్వ సాయాన్ని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచులు దొమ్మేటి అర్జునరావు, అంబటి సుబ్బలక్ష్మి, పీఏసీఎస్ అధ్యక్షుడు భూపతిరాజు సత్యనారాయణరాజు, జానకమ్మ సత్రం చైర్మన్ కొప్పెల్ల మల్లి, వైఎస్సార్ సీపీ నాయకులు పమ్మి చంటి, సంపత్‌రావు, తోటకూర సత్యనారాయణ, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పితాని రాంబాబు, సెక్రటరీ నిమ్మకాయల బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో విమర్శలు లేని పాలన: ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

అయినవిల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో విమర్శలు లేని పాలనను అందిస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తెలిపారు. బుధవారం మండలంలోని చింతనలంకలో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో గడపగడపకూ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఎమ్మెల్యే గడపగడపకూ వెళ్లి ప్రభుత్వ పాలన ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరుతున్నాయా అని అడిగారు. వరద సమయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదుకున్నట్లు ఎవరూ ఆదుకోలేదని లంక గ్రామస్తులు తెలిపారు. రాష్ట్రంలో ప్రజలకు సంక్షేమ పాలన అందుతుందన్నారు. ఎమ్మెల్యే వెంట నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు కన్నాసుల సీతారామాంజనేయులు, సర్పంచ్ చింతలపూడి వెంకటరత్నం, ఎంపీటీసీ సభ్యులు చల్ల బత్తుల సాయిలక్ష్మి, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు రాయుడు శ్రీనివాస్, వార లక్ష్మీనరసింహరామ్, కమిడి వెంకటేశ్వరరావు, బొంతు రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ఆలమూరు: మండలంలోని పెదపళ్లలో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన వలంటీర్ తాతపూడి చినరాజు కుటుంబానికి ఆర్థికసాయం పంపిణీ జరిగింది. రాష్ట్ర పార్టీ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు బుధవారం బాధితుడి నివాసానికి వెళ్లి రూ.పదివేల ఆర్థికసాయం అందించారు. దాత ప్రభాకరరావును పలువురు గ్రామస్తులు కొనియాడారు.

తడిపొడి విధానంతో చీడపీడల నివారణ

అంబాజీపేట: వరి పంటలో తడి పొడి సాగు చేయడం వల్ల మిథేన్ విషవాయువును నియంత్రించడమే కాకుండా పర్యావరణానికి హాని కలగకుండా చేయవచ్చని ప్రొఫెసర్ నరసింహారెడ్డి రైతులకు వివరించారు. పుల్లేటికుర్రు శివారు వ్యాఘ్రేశ్వరంలో హైదరాబాద్ కోర్ కార్బన్‌ఎక్స్ సొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్ సహకారంతో వ్యాఘ్రేశ్వర ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో తడిపొడి వరి సాగు విధానంపై బుధవారం అవగాహన కల్పించారు. తడిపొడి విధానంతో చీడపీడల నుంచి పంటలను కాపాడుకోవచ్చన్నారు. అందుకుగాను ఎకరాకు ఏడాదికి రూ.800 ప్రోత్సాహకాన్ని ఇవ్వనున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జల్లి బాలరాజు, ఎంపీటీసీలు కుసుమ వెంకటేష్, పబ్బినీడి రాంబాబు, ఉప సర్పంచ్ వీర రవి తదితరులు పాల్గొన్నారు.